بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ    نَحۡمَدُہٗ وَنُصَلِّیۡ عَلٰی رَسُوۡلِہِ الۡکَرِیۡمِ    وَعَلٰی عَبۡدِہِ الۡمَسِیۡحِ الۡمَوۡعُوۡدِ

Summary of Friday Sermon Hazrat Khalifatul Masih V, 13 March 2026 (Telugu)

## తౌహీద్ (దైవ ఏకత్వ) స్థాపన నేపథ్యంలో
## హజ్రత్ ముహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర విశ్వాసభరిత ప్రస్తావన

**హజ్రత్ అమీరుల్ ముమినీన్ ఖలీఫతుల్ మసీహిల్ ఖామిస్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ 13.03.2026 తేదీన – మస్జిద్ ముబారక్ ఇస్లామాబాద్, టిల్‌ఫోర్డ్, (సిర్రె) ఇంగ్లాండ్‌లో ప్రసంగించిన ఖుత్బా జుమా సారాంశం**

أَشْهَدُ أَنْ لَّا إِلٰهَ إِلَّا اللّٰهُ وَحْدَهٗ لَا شَرِيْكَ لَهٗ وَأَشْهَدُ أَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ. أَمَّا بَعْدُ فَأَعُوْذُ بِاللّٰهِ مِنَ الشَّيْطٰنِ الرَّجِيْمِ.
بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ اَلْحَمْدُ لِلّٰهِ رَبِّ الْعٰلَمِيْنَ ○ الرَّحْمٰنِ الرَّحِيْمِ ○ مٰلِكِ يَوْمِ الدِّيْنِ ○ إِيَّاكَ نَعْبُدُ وَإِيَّاكَ نَسْتَعِيْنُ ○ اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ ○ صِرَاطَ الَّذِيْنَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوْبِ عَلَيْهِمْ وَلَا الضَّآلِّيْنَ ○

తషహ్హుద్, తఅవ్వుజ్, ఫాతిహా అధ్యాయ పఠనానంతరం హుజూరె అన్వర్ అయ్యదహుల్లాహు తఆలా బినస్రిహిల్ అజీజ్ ఇట్లు ఉపదేశించారు.

రెండు శుక్రవారాల క్రితం దైవ ప్రవక్త హజ్రత్ మహమ్మద్ సల్లల్లాహు అలైహి వసల్లం జీవిత చరిత్ర గురించి ప్రస్తావిస్తూ, ఆయన (స) హృదయంలో 'తౌహీద్' (దైవ ఏకత్వం) పట్ల ఉన్న తపన, వేదన గురించి నేను వివరించాను. ఈ ఉద్దేశ్యం కోసమే ఆయన (స) ఈ లోకానికి అవతరించబడ్డారు. దీని స్థాపన కోసం ఆయన కేవలం తన మాటలు, పనుల ద్వారా ఆరాటాన్ని కనబరచడంతో పాటు తమ అనుచరులలో కూడా దైవ ఏకత్వం కోసం ఎలాంటి త్యాగానికైనా సిద్ధపడే అసాధారణమైన స్ఫూర్తిని నింపారు. దీనికి సమానమైన ఉదాహరణ మరెక్కడా లభించదు.

నేడు కూడా నేను ఆయన (స) జీవిత చరిత్రలోని ఇదే అంశం గురించి ప్రస్తావింతును మరియు ఈ సందర్భంలో కొందరు అనుచరుల త్యాగాల గురించి కూడా ప్రస్తావించడం జరుగుతుంది.

ఒకసారి అన్యారాధకులు దైవ ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంతో నీవు మా దైవాల గురించి ఇలా మాట్లాడటం లేదా? అని అడిగారు. దానికి ఆయన (స) అవును! అని సమాధానమిచ్చారు. ఆ మాట వినగానే వారందరూ ఆయన్ను చుట్టుముట్టారు. ఆ సమయంలో ఎవరో ఒకరు హజ్రత్ అబూ బకర్ రజియల్లాహు అన్హు వద్దకు వెళ్లి నీ స్నేహితుడి పరిస్థితి ఏమిటో చూడని చెప్పారు. హజ్రత్ అబూ బకర్ (రజి) వెంటనే బయలుదేరి మస్జిదుల్ హరామ్‌కు చేరుకున్నారు. అక్కడ ప్రజలందరూ పవిత్ర ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లంను చుట్టుముట్టి ఉండటం ఆయన (స) గమనించారు. అప్పుడు హజ్రత్ అబూ బకర్ (రజి) ఇలా అన్నారు. اَتَقْتُلُوْنَ رَجُلًا اَنْ يَّقُوْلَ رَبِّيَ اللّٰهُ وَقَدْ جَآءَكُمْ بِالْبَيِّنٰتِ مِنْ رَّبِّكُمْ అనగా "ఓ మానవులారా! మీరు ఒక వ్యక్తిని అల్లాహ్ నా ప్రభువు అనినందులకే చంపుదురా? అతడు మీ ప్రభువు వైపు నుండి సంకేతములు కూడ తెచ్చెను. ఇది వినగానే వారు దైవ ప్రవక్త (స) ను వదిలేసి, హజ్రత్ అబూ బకర్ (రజి) పై పడి ఆయన్ను కొట్టడం ప్రారంభించారు. హజ్రత్ అబూ బకర్ (రజి) కుమార్తె ఇలా పేర్కొన్నారు. ఆయన (అబూ బకర్) మా వద్దకు తిరిగి వచ్చినప్పుడు, ఆయన తన తల వెంట్రుకలను తాకగానే అవి చేతిలోకి ఊడి వస్తున్నాయి (అంత క్రూరంగా వారు ఆయన్ను హింసించారు).

హజ్రత్ ముస్లిహ్ మౌఊద్ (రజి) ఇలా వివరించారు. ఒకసారి దైవ ప్రవక్త (స) బజారు గుండా వెళ్తుండగా మక్కాలోని అల్లరి మూక ఒకటి ఆయన్ను చుట్టుముట్టింది. దారి పొడవునా వారు ఆయన (స) మెడపై కొడుతూ ఓ ప్రజలారా! ఇతనే తాను ప్రవక్తనని చెప్పుకుంటున్న వ్యక్తి అని ఎగతాళి

చేయసాగారు. ఆయన (స) ఇంటిపై పొరుగు ఇళ్ల నుండి నిరంతరం రాళ్లు రువ్వేవారు, ఇంటి లోపల మురికి వస్తువులను విసిరేవారు. చివరికి వంట చేసే ప్రదేశాలలో కూడా అపవిత్రమైన వస్తువులను వేసేవారు. అయినప్పటికీ ఆ పవిత్ర ఆత్మపై వేల వేల దురూద్‌లు వర్షించుగాక! దైవ ఏకత్వ స్థాపన కోసం ఆయన (స) హృదయంలో ఉన్న తపన ఒక్క క్షణం కూడా తగ్గలేదు. ఈ బాధలన్నింటినీ ఆయన (స) ఎంతో మనోధైర్యంతో, ప్రసన్న వదనంతో స్వీకరించారు. మానవాళిపై ఆయనకున్న జాలి, కరుణ మరియు ప్రేమలో రవ్వంత కూడా తక్కువ కాలేదు.

ఒకసారి దైవ ప్రవక్త (స) మస్జిదుల్ హరామ్‌లో నిలబడి మక్కా అన్యారాధకులను ఉద్దేశించి ఇలా అన్నారు: "లా ఇలాహ ఇల్లల్లాహ్" (అల్లాహ్ తప్ప మరెవరు ఆరాధనకార్హుడు లేడు) అని పలకండి, మీరు విజయం సాధిస్తారు. ఇది వినగానే ఖురైషీలు ఆయన (స) పై విరుచుకుపడ్డారు. హజ్రత్ హారిస్ బిన్ అబీ హాలా (రజి) అందరికంటే ముందుగా దైవ ప్రవక్త (స) వద్దకు చేరుకున్నారు. ఆయనను రక్షించడం కోసం హారిస్ ఆ గుంపుతో పోరాడటం మొదలుపెట్టి, వారిని ప్రవక్త (స) నుండి విడదీశారు. అప్పుడు ఆ గుంపు అంతా హారిస్ పై పడి చివరకు ఆయనను షహీద్ (అమరవీరుడు) చేశారు.

మక్కా అవిశ్వాసులు మూడు సంవత్సరాల పాటు పవిత్ర ప్రవక్త (స) ను మరియు ఆయన (స) కుటుంబ సభ్యులను 'శి'బే అబీ తాలిబ్' అనే లోయలో బంధించి, వారితో అన్ని రకాల సామాజిక సంబంధాలను తెంచుకున్నారు (అనగా వారిని బహిష్కరించారు). ఈ దిగ్బంధనం ముగిసిన తర్వాత పవిత్ర ప్రవక్త (స) దైవ ఏకత్వ ప్రచారాన్ని మునుపటి కంటే ఎక్కువగా ఉధృతం చేశారు.

ఆయన (స) చేసిన 'తాయిఫ్' నగర ప్రయాణానికి సంబంధించిన ప్రసిద్ధ సంఘటన మరియు అక్కడ ఆయన (స) పై జరిగిన అకృత్యాల గురించి చరిత్రలో వివిధ రకాలుగా వివరించబడింది. హజ్రత్ మిర్జా బషీర్ అహ్మద్ (రజి) ఇలా వ్రాశారు. శి'బే అబీ తాలిబ్ దిగ్బంధనం ముగిసిన తర్వాత, తాయిఫ్ వెళ్ళి అక్కడి ప్రజలకు ఇస్లాం ఆహ్వానం అందించాలని దైవ ప్రవక్త (స) నిర్ణయించుకున్నారు. ఆయన (స) తాయిఫ్‌లో పది రోజులు ఉండి, నగరంలోని అనేక మంది ప్రముఖులను ఒకరి తర్వాత ఒకరిని కలిశారు. కానీ ఆ సమయంలో మక్కా వలె తాయిఫ్ ప్రజల తలరాతలో కూడా ఇస్లాం స్వీకరించే అదృష్టం లేకుండెను. చివరకు పవిత్ర ప్రవక్త (స) తాయిఫ్ ప్రధాన నాయకుడి వద్దకు వెళ్లి ఇస్లాం సందేశాన్ని అందించారు. కానీ అతను కూడా స్పష్టంగా తిరస్కరించి మీరు ఇక్కడి నుండి వెళ్ళిపోవడమే మంచిదని అన్నాడు. ఆ తర్వాత ఆ దుర్మార్గుడు నగరంలోని అల్లరి మూకలను పవిత్ర ప్రవక్త (స) వెనుక ఉసిగొల్పాడు. వారు కేకలు వేస్తూ ఆయనను వెంబడించారు, ఆయన (సల్లం)పై రాళ్లు రువ్వడం ప్రారంభించారు. దీనివల్ల ఆయన (స) పవిత్ర శరీరమంతా రక్తంతో తడిసిపోయింది. తాయిఫ్ నుండి మూడు మైళ్ల దూరంలో మక్కా ప్రముఖుడైన ఉత్బా బిన్ రబీఆ కు చెందిన ఒక తోట ఉండెను. మహా ప్రవక్త (స) అందులోకి వెళ్లి ఆశ్రయం పొందారు. అప్పుడు ఆ దుండగులు అలసిపోయి వెనుదిరిగి వెళ్ళారు. ఉత్బా తన క్రైస్తవ బానిస అయిన అద్దాస్ చేతికి ఒక పళ్లెంలో ద్రాక్ష పండ్లను పంపి దైవ ప్రవక్త (స)కు అందించాడు. దైవ ప్రవక్త (స) అద్దాస్‌ను అతని పేరు, అతను ఎక్కడి నుండి వచ్చాడో అడిగారు. తాను నైన్వా (Nineveh) నివాసినని అతను చెప్పాడు. అప్పుడు పవిత్ర ప్రవక్త (స) ఇలా అన్నారు. నేను నీ గ్రామానికి చెందిన ప్రవక్త యూనుస్ బిన్ మత్తా అలైహిస్సలాం సోదరుడిని. పవిత్ర ప్రవక్త (స) ఆ తోటలో కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్న తర్వాత అక్కడి నుండి బయలుదేరారు.

పవిత్ర ప్రవక్త (స) దైవ ఏకత్వ స్థాపన కోసం మక్కాలో వ్యక్తిగతంగా, సామూహికంగా ప్రచార బాధ్యతను నిర్వర్తించేవారు. ఆయన (సల్లం) అరబ్ దేశంలోని బజార్లకు వెళ్లి, అక్కడ సాటిలేని అల్లాహ్

వైపుకు రావాలని సందేశాన్ని అందించేవారు. మక్కా వెలుపల వివిధ ప్రాంతాలలో ప్రజలు సమావేశమయ్యే వారు. వాటిని అస్వాఖుల్ అరబ్ (అరబ్బుల సంతలు/బజార్లు) అని పిలిచేవారు. వాటిలో ఉకాజ్, మజన్నా మరియు జుల్ మజాజ్ అనేవి ప్రసిద్ధ అరబ్ బజార్లు. హజ్రత్ జాబిర్ (రజి) నుండి వచ్చిన ఒక కథనం ప్రకారం దైవ ప్రవక్త (స) హజ్ రోజుల్లో ఉకాజ్ మరియు మజన్నా సంతలకు వెళ్ళేవారు. ఆయన (స) ప్రజల ఇళ్లకు మరియు వారు బస చేసిన ప్రదేశాలకు వెళ్లి వారిని ఇస్లాం వైపు ఆహ్వానించేవారు. దైవ ప్రవక్త (స) ఇలా అడిగేవారు. నా ప్రభువు సందేశాన్ని అందించడానికి నాకు ఆశ్రయం ఇచ్చే వారు ఎవరైనా ఉన్నారా? నాకు సహాయం చేసే వారు ఎవరైనా ఉన్నారా?

మక్కా ఖురైషీలు ఒకవైపు దైవ ప్రవక్త (స) ను ఇస్లాం ప్రచారం చేయకుండా ఆపడానికి ప్రయత్నిస్తుండగా, మరోవైపు ఇస్లాం స్వీకరించిన వారిపై క్రూరమైన హింసను, ఘోరమైన అకృత్యాలను కొనసాగించారు. ఆ హింసల వివరాలను వర్ణించడానికి కలం కూడా తడబడుతుంది.

హజ్రత్ బిలాల్ (రజి) విశ్వాసం స్వీకరించినప్పుడు ఆయన యజమాని ఆయనను పట్టుకుని నేలపై పడ వేసి, ఆయనపై వేడి రాళ్లను, ఆవు చర్మాన్ని పెట్టేవాడు. నీ దైవం లాత్ మరియు ఉజ్జా (విగ్రహాలు) అని చెప్పమని బలవంతం చేసేవాడు. కానీ హజ్రత్ బిలాల్ (రజి) మాత్రం అహద్, అహద్ (దేవుడు ఒక్కడే, ఒక్కడే) అని పలికేవారు. ఆ తర్వాత హజ్రత్ అబూ బకర్ (రజి) ఆయనను ఏడు ఓకియాల (అనగా 280 దిర్హమ్‌ల) కు కొనుగోలు చేసి బానిసత్వం నుండి విముక్తి కలిగించారు.

మక్కా ఖురైషీలు కేవలం ముస్లింలపైనే కాకుండా మహా ప్రవక్త (స) పై కూడా దాడులు చేసేవారు. ఆయన (స) పవిత్ర వ్యక్తిత్వం కూడా వారి హింస నుండి తప్పించుకోలేదు. వాస్తవానికి అందరికంటే ఎక్కువ కష్టాలను, ఇబ్బందులను మహా ప్రవక్త (స) అనుభవించారు. ఆయన (స) పేరు 'ముహమ్మద్' (అనగా అత్యధిక ప్రశంసలకర్హులు) కానీ వారు (స) ఆ పేరును మార్చి (నవూజుబిల్లాహ్) ముజమ్మమ్ (అనగా అత్యధికంగా నిందించబడేవాడు) అని పిలిచేవారు. (నవూజుబిల్లాహ్) ఆయనను అబద్ధాలకోరని, మోసగాడని, లోభి అని నిందించేవారు. ఆయన (స) పై రాళ్లు రువ్వేవారు మరియు కొన్నిసార్లు ఆయన (స) పై మురికిని కూడా విసిరేవారు.

హజ్రత్ మసీహ్ మౌఊద్ (అలైహిస్సలాం) ఇలా ప్రవచించారు. ముహమ్మద్ అనే పేరుతో ఉన్న ఈ అరబ్బు ప్రవక్తను నేనెప్పుడూ ఆశ్చర్యంతో దర్శిస్తూ వుంటాను. వేల వేల ఆశీస్సులు, శాంతి అతనికి లభించుగాక. ఎంత మహోన్నత పదవి అతనిది? అతని ఉనికి పొలిమేరలను ఎవ్వడూ కనుగొనలేడు. గంభీరమైన, ప్రగాఢమైన అతని మహిత లక్షణాలను సమగ్రంగా, సందర్శించగలిగే యోగ్యత ఎవ్వరికీ లేదు. అయ్యో! అతని మహోత్తాల పదవికి రాదగినంత గుర్తింపు రాలేదు. ప్రపంచం నుంచి అంతర్ధానమై పోయిన దైవ ఏకత్వం ఈ మహావీరుని ప్రయత్నం వల్లనే తిరిగి సాధింపబడినది. అతను దేవుని ప్రగాఢంగా ప్రేమించియున్నాడు. అదే విధంగా మానవాళి పట్ల తీవ్రమైన సమవేదన అతని హృదయాన్ని ద్రవీభూతం చేసింది. అందుకే దేవుడు అతని హృదయంలో దాగిన మహోన్నత గుణాలను తెలుసుకొని గతంలోని, భవిష్యత్తులోని ప్రవక్తల కంటే, సర్వజనుల కంటే మహోన్నతుని గావించినాడు. అతని జీవిత కాలంలోనే అతని ఆకాంక్షలను నెరవేర్చినాడు. ఆయనే ప్రతి అనుగ్రహానికి మూలధారము. ఆయన (ముహమ్మద్ సల్లం) ద్వారానే తనకు ఈ గొప్పతనం లభించిందని ఒప్పుకోకుండా ఎవరైనా తనంతట తానుగా గొప్పతనాన్ని దావా చేస్తే అతను మనిషి కాదు, షైతాన్ సంతతి. ఎందుకంటే ప్రతి శ్రేష్ఠత తాళంచెవి ఆయనకే ఇవ్వబడింది, ప్రతి జ్ఞాన భండాగారం ఆయనకే ప్రసాదించబడింది. ఆయన (సల్లం) ద్వారా పొందనివాడు శాశ్వతంగా దేవుని కృపకు దూరమైనవాడే. మన స్థాయి ఏమిటి? మన

యథార్థత ఏమిటి? నిజమైన దైవ ఏకత్వాన్ని మనం ఈ ప్రవక్త (సల్లం) ద్వారానే పొందామని, సజీవ దేవుని గుర్తింపును ఈ పరిపూర్ణ ప్రవక్త (సల్లం) ద్వారా, ఆయన (సల్లం) కాంతి ద్వారానే పొందామని మనం అంగీకరించకపోతే అది కృతజ్ఞతారాహిత్యం అవుతుంది. దేవుని సంభాషణ, సంబోధనల భాగ్యం దేవుని ముఖాన్ని మనం దర్శించే గౌరవం కూడా ఆ మహోన్నత ప్రవక్త (సల్లం) ద్వారానే మనకు లభించింది.

హజ్రత్ మసీహ్ మౌఊద్ అలైహిస్సలాం ఇంకా ఇట్లనిరి. ఆ మార్గదర్శక సూర్యుని (ముహమ్మద్ సల్లం) కిరణాలు ఎండలా మనపై పడుతున్నాయి. మనం ఆయనకు ఎదురుగా నిలబడినంత కాలమే మనం ప్రకాశించగలము. మహా ప్రవక్త (సల్లం) పై విశ్వాసం ఉంచని వారు లేదా ఇస్లాంను వదిలివేసిన వారు కూడా దేవుని ఏకత్వాన్ని నమ్మితే చాలు మోక్షం పొందుతారని భావించే వారి ఆలోచన తప్పు. మోక్షం అనేది రెండు విషయాలపై ఆధారపడి ఉంటుంది. (1) సంపూర్ణ నిశ్చయంతో అల్లాహ్ ఉనికిని మరియు అతని ఏకత్వాన్ని నమ్మడం. (2) అల్లాహ్ పట్ల అపారమైన ప్రేమను కలిగి ఉండటం. ఆ ప్రేమ ప్రభావం ఎంతలా ఉండాలంటే దేవుని విధేయత పాటించడమే ప్రాణానికి అసలైన శాంతిగా మారాలి, ఆ ప్రేమ ఇతర అన్ని ప్రాపంచిక వ్యామోహాలను తుడిచిపెట్టాలి. ఇదే అసలైన దైవ ఏకత్వం, ఇది మన నాయకులు, యజమాని అయిన ముహమ్మద్ (సల్లం)ను అనుసరించకుండా అస్సలు లభించదు. అది ఎందుకు లభించదు? ఎందుకంటే దేవుని సారాంశం అత్యంత రహస్యమైనది, మానవ మేధస్సు కేవలం తన శక్తితో దానిని కనుగొనలేదు. మేధస్సు కేవలం సృష్టిని చూసి ఒక సృష్టికర్త అవసరమని గ్రహించగలదు. కానీ ఆ దేవుడు నిజంగా ఉన్నాడనే సంపూర్ణ నమ్మకాన్ని మేధస్సు స్వయంగా ఇవ్వలేదు. కనుక నిశ్చయమైన దైవ ఏకత్వం కేవలం ప్రవక్త (సల్లం) ద్వారానే లభిస్తుందని ఖచ్చితంగా తెలుసుకోండి.

హుజూరె అన్వర్ ఇట్లనిరి. అందుకే మనం ప్రవక్త (సల్లం)తో నిజమైన ప్రేమను కలిగి ఉండవలెను. ఈ కాలంలో దైవ ఏకత్వ స్థాపన కోసం దైవ ప్రవక్త (సల్లం) సత్య దాసుడిని (మసీహ్ మౌఊద్‌ను) అల్లాహ్ తఆలా పంపాడు. మనం వారి (అ) బైఅత్ చేసినందున ఈ బాధ్యతను నెరవేర్చడానికి మనం పూర్తి శక్తితో ప్రయత్నించవలెను. ముఖ్యంగా ఈ రమజాన్ రోజుల్లో దైవ ఏకత్వ స్థాపనలో మనమందరం ముందుండాలని దుఆ చేయవలెను. అల్లాహ్ తఆలా మనందరిని ఇందుకు అనుగ్రహించుగాక! ముస్లిం సమాజం కోసం కూడా ప్రార్థించండి, వారు కూడా నిజమైన దైవ ఏకత్వాన్ని అర్థం చేసుకుని, దానిని అనుసరించేవారిగా అగుదురుగాక!

ముగింపులో హుజూరె అన్వర్ (అల్లాహ్ తఆలా ఆయనకు సహాయకుడవుగాక) నైజీరియాకు చెందిన జమాఅత్ మురబ్బీ గౌ॥ జిక్రుల్లాహ్ తాయూ అయ్యూబ్ గారి సద్గుణాలను ప్రస్తావించిన తర్వాత వారి పరోక్ష అంత్యక్రియ ప్రార్థన చదివింతునని ప్రకటించారు.

اَلْحَمْدُ لِلّٰهِ نَحْمَدُهٗ وَنَسْتَعِيْنُهٗ وَنَسْتَغْفِرُهٗ وَنُؤْمِنُ بِهٖ وَنَتَوَكَّلُ عَلَيْهِ - وَنَعُوْذُ بِاللّٰهِ مِنْ شُرُوْرِ اَنْفُسِنَا وَمِنْ سَيِّئَاتِ اَعْمَالِنَا - مَنْ يَّهْدِهِ اللّٰهُ فَلَا مُضِلَّ لَهٗ وَمَنْ يُّضْلِلْهُ فَلَا هَادِيَ لَهٗ - وَنَشْهَدُ اَنْ لَّآ اِلٰهَ اِلَّا اللّٰهُ وَنَشْهَدُ اَنَّ مُحَمَّدًا عَبْدُهٗ وَرَسُوْلُهٗ - عِبَادَ اللّٰهِ رَحِمَكُمُ اللّٰهُ! اِنَّ اللّٰهَ يَاْمُرُ بِالْعَدْلِ وَالْاِحْسَانِ وَاِيْتَآءِ ذِي الْقُرْبٰى وَيَنْهٰى عَنِ الْفَحْشَآءِ وَالْمُنْكَرِ وَالْبَغْيِ - يَعِظُكُمْ لَعَلَّكُمْ تَذَكَّرُوْنَ - اُذْكُرُوا اللّٰهَ يَذْكُرْكُمْ وَادْعُوْهُ يَسْتَجِبْ لَكُمْ وَلَذِكْرُ اللّٰهِ اَكْبَرُ -